క్లుప్తంగా

నాణ్యమైన విత్తనాలను అందించాలి



మహమ్మదాబాద్: వర్షాలు కురుస్తున్న సమయంలో రైతుల పంటల సాగుకు నాణ్యమైన విత్తనాలతో పాటు నిర్ణీత ధరలకు ఎరువులను అందించాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాల్లో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోతున్నారని అందుకు ఎరువుల దుకాణాల యజమానులు నాణ్యమైన విత్తనాలు అందించాలని సూచించారు. డీలర్లు బిల్లులు లేకుండా ఎరువులు, విత్తనాలు అమ్మకూడదని తెలిపారు. అధిక ధరలకు ఎరువులు అమ్మితే వారి లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి నరేందర్ ఉన్నారు.

'కురుమూర్తి' సన్నిధిలో విద్యామండలి వైస్ చైర్మన్



చిన్నచింతకుంట: తెలంగాణ రాష్ట ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం, విద్యామండలి కార్యదర్శి శ్రీరాం వెంకటేష్‌లు గురువారం చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపూర్ కురుమూర్తి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి శాలువాలతో సత్కరించారు. అనంతరం వారు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వారి వెంట ఓయూ జేఏసీ నాయకులు డాక్టర్ జానకిరామ్, గంజి బాల్‌రాజు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లతో సొంతింటి కల సాకారం



మహమ్మదాబాద్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో నిరుపేదల సొంతింటి కల సాకారం అవుతుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేఎం నారాయణ, మాజీ ఎంపీపీ శాంతిబాయి తెలిపారు. గురువారం మండలంలోని చిన్నాయపల్లి, షేక్‌పల్లి, నంచర్ల గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గు వేసి ప్రొసీడింగ్స్ అందించారు. కార్యక్రమంలో మండల నాయకులు వెంకట్రాములు, ఈసా పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరుశాతం మెరుగుపర్చాలి

కోయిల్‌కొండ: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల హాజరుశాతాన్ని మెరుగుపర్చాలని జిల్లా విద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని లింగుపల్లి ప్రాథమికపాఠశాలలో విద్యార్థులకు యునిఫామ్స్, నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు పాఠశాలలో సమయపాలన తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఆయన వెంట ఎంఈఓ వెంకట్‌జీ, ఉపాధ్యాయులు గోపాల్‌నాయక్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌నాయక్ ఉన్నారు.

అధ్యాపకుల ప్రచారం



దేవరకద్ర: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు గురువారం ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. పదిలో ఉత్తీర్ణులైన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించాలని వారి తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. కళాశాల ప్రగతిపై కరపత్రాలను పంపిణీ చేశారు.

బాలికను రక్షించిన పోలీసులు

మహబూబ్‌నగర్ క్రైం: తల్లి మందలించడంతో ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలికను పోలీసులు గుర్తించి గురువారం టూటౌన్ పోలీసులకు అప్పగించారు. టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ కథనం ప్రకారం.. జిల్లాకేంద్రానికి చెందిన బాలిక ఈ నెల 5న తల్లి మందలించిందనే కోపంతో రైల్వే స్టేషన్ నుంచి గుర్తు తెలియని రైలు ఎక్కి వెళ్లిపోయింది. ఆ తర్వాత ఆ అమ్మాయి కలకత్తా అక్కడి నుంచి తమిళనాడు వెళ్లగా అక్కడ ఒక వ్యక్తి ఫోన్ నుంచి తల్లికి ఫోన్ చేయగా అతని టవర్ సిగ్నల్ ఆధారంగా తమిళనాడులో ఉన్నట్లు గుర్తించి ప్రత్యేక టీం సహాయంతో గుర్తించి బాలికను రక్షించి తిరిగి తల్లికి అప్పగించారు.

మోగిన బడిగంట

- విద్యార్థులకు ఘన స్వాగతం
- మొదటిరోజే పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ
- మిడ్జిల్‌లో హాజరైన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి



ఇస్రంపల్లిలో విద్యార్థులకు కొత్త దుస్తులను పంపిణీ చేసిన ఉపాధ్యాయులు

సాక్షి, నెట్‌వర్క్: విద్యార్థులకు ఉపాధ్యాయులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మొదటి రోజు గురువారం నవాబుపేట మండల కేంద్రంలోని పాఠశాలలు అందంగా అలంకరించి విద్యార్థులకు స్వాగతం పలికారు. పోమాల్ అంగన్‌వాడీలో విద్యార్థులను చేర్చుకుని వారితో సెల్ఫీ స్టాండులు ఏర్పాటు చేసి ఫొటోలు దిగారు. అలాగే చెన్నరెడ్డిపల్లి పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్, నోట్ పుస్తకాలు అందించారు. ఈ సందర్భంగా ఆయ పాఠశాలలో జరిగిన కార్యక్రమాల్లో మండల విద్యాశాఖ అధికారి నాగ్యనాయక్, జనార్దన్, రాములు, సదాశివుడు, భూపతిసింగ్, తదితరులు పాల్గొన్నారు.

■ అడ్డాకుల, మూసాపేట మండలాల్లోని గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. మొదటి రోజే విద్యార్థులకు ఉపాధ్యాయులు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. అదేవిధంగా స్కూల్ యూనిఫామ్స్ అందజేశారు. ఎంఈఓలు కురుమూర్తి, రాజేశ్వర్‌రెడ్డి పాఠశాలలను సందర్శించారు.

■ మిడ్జిల్‌లో పాఠశాలలు ప్రారంభం కావడంతో మామిడి తోరణాలు, బెలూన్స్‌తో ముస్తాబు చేసి విద్యార్థులకు పూలు ఇచ్చి ఉపాధ్యాయులు స్వాగతం పలికారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పాల్గొని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి, తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ సాయిలక్ష్మి, ఎంఈఓ వెంకటయ్య, నాయకులు పాల్గొన్నారు.

■ దేవరకద్ర మండలం అడవి అజిలాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలకు మామిడి ఆకులు, పూలతో స్వాగత తోరణాలు కట్టి విద్యార్థులకు స్వాగతం పలికారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేశారు. పెద్దరాజమూర్, వెంకటాయపల్లి, లక్ష్మీపలి, గూరకొండ, నార్లోనికుంట్ల, నాగారం, కోయిల్‌సాగర్, హజిలాపూర్, చౌదర్‌పల్లి, గోపన్‌పల్లి గ్రామాలలోని పాఠశాలలో ఒకటో తరగతిలో చేరిన విద్యార్థులకు పూలు ఇచ్చి స్వాగతం పలికి పాఠ్యపుస్తకాలను అందజేశారు. మిగతా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, స్కూల్ డ్రెస్‌లను పంపిణీ చేశారు.

■ కొకుంట్ల మండలంలోని ఇస్రంపల్లి, కొకుంట్ల పాఠశాలల్లో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి కొత్త విద్యా సంవత్సరంలోకి విద్యార్థులకు స్వాగతం పలికారు.



చెన్నరెడ్డిపల్లిలో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్స్ అందిస్తున్న అధికారులు



నవాబుపేటలో విద్యార్థులకు కరచాలనం చేసి స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు



అడవిఅజిలాపూర్‌లో మంగళ తోరణాలతో విద్యార్థులకు స్వాగతం పలికిన ఉపాధ్యాయులు

మళ్లీ తడిసిన ధాన్యం



దొడ్డిపల్లిలో తడిసిన ధాన్యం

నవాబుపేట: వరుస వర్షాలతో ధాన్యం తడుస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదు. బుధవారం, గురువారం రెండు రోజులు వరుసగా వర్షాలకు ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తడిసింది. దీంతో మిల్లర్లు ధాన్యంలో ఎంత కోత విధిస్తారోనని రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నవాబుపేట, కూచూర్, దొడ్డిపల్లి రైతుల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తడిసింది. వాటిని తూకాలు చేసిన ధాన్యం లోడింగ్ చేయలేదు. దీంతో అవి వేసిన చోటనే తడిసిపోయాయి. దీనికి సంబంధిం సంబందిత అధికారులను ఆరా తీస్తే గన్నీ బ్యాగులు ఆలస్యంగా రావటం, లోడింగ్‌కు లారీలు సరిగ్గా సమ యానికి రాకపోవటంతోనే ధాన్యం తడిసిందని సా కులు చెపుతున్నారు. ఈ విషయంలో జిల్లా అధికారులు స్పందించి ధాన్యం మిల్లర్లు కోతపెట్టకుండా రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

వర్షానికి కూలిన ఇళ్లు

జడ్చర్ల: జడ్చర్లలో గురువారం కురిసిన భారీ వర్షానికి 20వ వార్డులోని ఎస్‌వీపీ నగర్‌లో సవారమ్మ, సాయిలు, కుమ్మరి కృష్ణకు చెందిన ఇళ్లు కూలిపోయాయి. ఇళ్లు కూలిన సమయంలో ఇట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, వార్డు కౌన్సిలర్ శ్రావణి శ్యామ్, తదితరులు సంఘటనా స్థలానికి వెళ్లి బాధితులను పరామర్శించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. బాధితులను అన్ని విధాల ఆదుకుంటామని ఇందిరమ్మ ఇళ్లలో వారికి ప్రాధాన్యత కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

నీటమునిగిన ఎస్టీఓ కార్యాలయం

జడ్చర్ల టౌన్: భారీ వర్షానికి మున్సిపాలిటీ పరిధిలోని సబ్‌ట్రెజరీ కార్యాలయం నీట మునిగింది. పక్కనే తహసీల్దార్ కార్యాలయం ఎదుట మట్టి ఎత్తుగా ఉండటం వరద నీరు కార్యాలయం ముందు మడుగులా ఏర్పడి నీరు కార్యాలయంలోకి వెళ్లింది. దీంతో కార్యాలయ సిబ్బంది తీవ్ర అసౌకర్యానికి గురైనట్లు ట్రెజరీ అధికారి విజయ్‌భాస్కర్ పేర్కొన్నారు. వర్షం తగ్గిన తరువాత జేసీబీ సహాయంతో తహసీల్దార్ కార్యాలయం వెనకాల నుంచి వరదనీరు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు.



భూత్పూర్‌లో రోడ్డుపై వర్షం నీటితో నిండిన మహబూబ్‌నగర్ వెళ్లే రహదారి



ఎస్టీఓ కార్యాలయంలోకి వచ్చిన వరదనీరు

భూత్పూర్‌లో భారీ వర్షం

భూత్పూర్: భారీ వర్షం కురవడంతో గురువారం పట్టణంలోని చౌరస్తాలో రహదారులు జలమయమై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. రెండు గంటల పాటు భారీగా వర్షం కురిసింది. చౌరస్తాలో డ్రెయినేజీలు నాసిరక నిర్మాణం వల్ల నీరు వెళ్లకపోవడంతో రోడ్డుపై నిలిచింది. అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

ప్రతి పల్లెకు బస్సు సౌకర్యం కల్పిస్తాం

- ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి



దమగ్నాపూర్ గ్రామంలో ఆర్టీసీ బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి

చిన్నచింతకుంట: నియోజకవర్గంలోని ప్రతి పల్లెకు బస్సు సౌకర్యం కల్పిస్తామని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం చిన్నచింతకుంట మండలంలోని దమగ్నాపూర్, సీతారాంపేట గ్రామాలకు ఆర్టీసీ బస్సును ప్రారంభించారు. ఆయన బస్సులో ప్రయాణించి ప్రయాణికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెద్దవడ్డేమాన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందించిన పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫామ్స్ అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, నాయకులు రంజిత్‌రెడ్డి, వట్టెం శివ, పాఠశాల సిబ్బంది, దమగ్నాపూర్, వడ్డేమాన్ ప్రజలు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్ల పేరుతో మోసం

దేవరకద్ర: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్ల పేరుతో ప్రజలను మోసం చేసిందని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. దేవరకద్ర మండల పరిషత్ కార్యాలయం వద్ద ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో పేదలకు డబుల్‌బెడ్రూంల ఆశ చూపి మొండి చేయి చూపించిందని విమర్శించారు. పైలెట్ ప్రాజెక్టు కింద మీ నుగోనిపల్లికి 80 ఇళ్లు మంజూరు కాగా, 40 ఇళ్ల ని ర్మాణం చేపట్టారని, ఇటీవల జయమ్మ నిర్మించుకున్న మొదటి ఇందిరమ్మ ఇంటిని ప్రారంభోత్సవం చేసినట్లు తెలిపారు. దేవరకద్ర మున్సిపాలిటీ, మండలంలోని వివిధ గ్రామాల 330 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఎమ్మెల్యే ప్రొసీడింగ్స్ అందజేశారు.

విచారణలో కేసీఆర్ ద్వంద్వ వైఖరి..

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో ఇంజినీర్లను, అధికారులను పక్కన పెట్టి తన సొంత ఆలోచనలతో నిర్మించానన్న కేసీఆర్ కమిషన్ ముందు తన తప్పును అధికారుల మీద పెట్టి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ వాడుతున్న భాషపై ఎమ్మెల్యే తీవ్ర అభ్యంతరం తెలిపారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

భూత్పూర్: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలంలోని 18 గ్రామాల్లో 314 మందికి, మున్సిపాలిటీలోని 10 వార్డుల్లో 120 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఎమ్మెల్యే ప్రొసీడింగ్స్ అందజేశారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ కృష్ణయ్య, టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి అరవింద్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ కతలప్ప, కురుమూర్తి దేవస్థాన కమిటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు అంజిల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ లక్ష్మీకాంత్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ శాఖ అధ్యక్షుడు లిక్కి నవీన్ గౌడ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు నర్సింహులు ఉన్నారు.

సంజీవ్ ముదిరాజ్‌ను సన్మానించిన ఎమ్మెల్యే



స్టేషన్ మహబూబ్‌నగర్: టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన సంజీవ్ ముదిరాజ్‌ను గురువారం హైదరాబాద్‌లోని సీఎల్‌పీ కార్యాలయంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. సంజీవ్ ముదిరాజ్ టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా ఎంపిక కావడం సంతోషంగా ఉందని, కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి కలిసి పనిచేస్తామని ఆయన స్పష్టం చేశారు.

15న పురస్కారాల అందజేత

మహబూబ్‌నగర్ రూరల్: 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియట్, ఎంసెట్, నీట్, జేఈఈ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన ఎరుకల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కోట వెంకట్రాములు, ప్రధాన కార్యదర్శి పర్వతాలు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈనెల 15న ఉదయం 10:30 గంటలకు స్థానిక అంబేడ్కర్ కళాభవన్‌లో ప్రతిభా పురస్కారాల కార్యక్రమం ఉంటుందని, జిల్లాలోని ఎరుకల విద్యార్థులు అత్యధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సాదాసీదాగా మున్సిపల్ సాధారణ సమావేశం

జడ్చర్ల టౌన్: జడ్చర్ల మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం గురువారం సాదాసీదాగా ముగిసింది. చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యులు పలు సమస్యలు ప్రస్తావించారు. మున్సిపల్ బడ్జెట్ లేకపోవటంతో సమస్యలపై చర్చించటానికి ఆస్కారం లేకుండా పోయింది. అయితే మున్సిపల్ కమిషనర్ వార్డుల్లో పర్యటించకపోవటం పట్ల వార్డు కౌన్సిలర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. తప్పనిసరిగా వార్డుల్లో పర్యటించి సమస్యలు పరిష్కరించేందుకు చూడాలని సూచించారు. అక్రమ నిర్మాణాల సమస్యలను సైతం కౌన్సిలర్లు లేవనెత్తారు. ఇప్పటి వరకు ఎన్ని నిర్మాణాలు నిలిపివేశారో తెలియజేయాలని కోరగా, కేవలం ఒక్కటి మాత్రమే నిలిపేశామని కమిషనర్ లక్ష్మారెడ్డి తెలిపారు. సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ పాలాది సారిక, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బాదేపల్లి హైస్కూల్లో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్

జడ్చర్ల టౌన్: రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య గురువారం బాదేపల్లి జెడ్పీహైస్కూల్‌ను సందర్శించారు. ఆయన విద్యార్థులకు యూనిఫాంలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. పదిలో 500లకుపైగా మార్కులు సాధించిన 16మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 1140 మంది విద్యార్థులు ఉన్న అతి పెద్ద పాఠశాలను సందర్శించటం సంతోషంగా ఉందన్నారు. విద్యతో ప్రపంచాన్ని జయించవచ్చని అంబేడ్కర్ తెలిపారని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్‌కుమార్, ఎస్సీ అభివృద్ధి జిల్లా అధికారి సుదర్శన్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి జనార్దన్, ఎంఈఓ మంజులాదేవి పాల్గొన్నారు.

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదైతే స్టేషన్ బెయిల్ ఇవ్వకుండా చూడాలని తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కానుగడ్డ యాదయ్య కోరారు. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు వినతిపత్రం సమర్పించారు. ఎస్సీ కార్పొరేషన్ వారికి బ్యాంక్‌తో సంబంధం లేకుండా రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

■ సెర్ప్‌లో పని చేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు ప్రమోషన్‌లో రిజర్వేషన్లు కల్పించాలని సెర్ప్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం నాయకుడు ఆలూరి చెన్నయ్య కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం సమర్పించారు.

■ ఎస్సీ అభివృద్ధి శాఖలో అద్దె వాహనాలకు 18 నెలలకు చెందిన బిల్లులను విడుదల చేసేలా చూడాలని తెలంగాణ ఫోర్ వీలర్స్ డ్రైవర్స్, హైర్ వెహికిల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ కోరారు.

■ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రత్యేక ప్రమోషన్ చానల్ ఏర్పాటు చేయాలని బహుజన టీచర్స్ ఫెడరేషన్ (బీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు పట్నం చెన్నయ్య కోరారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ కలిసి వినతిపత్రం సమర్పించారు.



బాదేపల్లిని సందర్శించిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

లావాదేవీల కోసమే బీఆర్‌ఎస్ కౌన్సిలర్ల ఆరాటం

- ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల: జడ్చర్ల మున్సిపాలిటీలో బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు లావాదేవీల కోసమే కొట్లాడుతున్నారని, ఇదే వారికి చివరి అవకాశమని వచ్చే ఎన్నికల్లో ఒక్కసీటు కూడా బీఆర్‌ఎస్ గెలవదని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో వరద పరిస్థితిని పరిశీలించిన తరువాత ఆయన మీడియాతో మాట్లాడారు. వార్డు కౌన్సిలర్లు సమావేశంలో లావాదేవీల విషయంలో బిజీగా ఉన్నారని ఆరోపించారు. జడ్చర్ల పట్టణ రూపు రేఖలను మారుస్తానని, రూ.70 కోట్లతో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ

మిడ్జిల్: మండల కేంద్రంలోని మహిళా సమాఖ్యలో గ్రామీణా స్వరాజ్య సంస్థ ఆధ్వర్యంలో 40 మంది మహిళలకు గురువారం జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి కుట్టుమిషన్లు అందజేశారు. మహిళలు తమ కాళ్లపైన నిలబడేందుకు కుట్టుమిషన్ల ద్వారా ఉపాధి పొందవచ్చని సూచించారు, కార్యక్రమంలో ఎంపీడీఓ గీతాంజలి, ఏపీఎం రాందాస్‌నాయక్, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు స్వాతి, నాయకులు అల్వాల్‌రెడ్డి, గౌస్, సాయిలు, వెంకటయ్య, మల్లికార్జున్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, కృష్ణయ్య పాల్గొన్నారు.



మిడ్జిల్‌లో మహిళలు కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

భూ భారతిని సద్వినియోగం చేసుకోవాలి

గండేడ్: భూ భారతిలో భాగంగా గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని గండేడ్ తహసీల్దార్ మల్లికార్జున్‌రావు తెలిపారు. గురువారం మండలంలోని కొంరెడ్డిపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో అర్‌ఐ యాసిన్, మాజీ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించేందుకే భూభారతి

మహమ్మదాబాద్: భూ సమస్యలు పరిష్కరించేందుకే భూ భారతి పథకాన్ని తీసుకొచ్చినట్లు తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలం లోని నంచర్ల గ్రామంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. భూ సమస్యలు గ్రామ గ్రామానికి వెళ్లి పరిష్కరించేందుకు అధికారులు పనిచేస్తున్నారని సూచించారు. రైతులు కూడా ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఎలాంటి భూ సమస్యలైనా నిర్ణయించిన కాలంలో ఆర్‌డీఓ, కలెక్టర్‌ల పరిధిలో పరిష్కరించబడతాయని తెలిపారు. పలువురు రైతుల దరఖాస్తులను తీసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేఎం నారాయణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు

భూత్పూర్: మండలంలోని 18 గ్రామ పంచాయతీలతో పాటు మున్సిపాలిటీలోని అమిస్తాపూర్, భూత్పూర్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులు గురువారం ముగిశాయి. భూత్పూర్, మండలంలోని కప్పెట గ్రామంతో రెవెన్యూ సదస్సులు పూర్తయ్యాయి. భూత్పూర్‌లో 53, కప్పెట 10 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిషన్, డిప్యూటీ తహసీల్దార్ గీత, ఆర్‌ఐలు, వెంకటేశ్, బాలసుబ్రమణ్యం, సీనియర్ అసిస్టెంట్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.



కొంరెడ్డిపల్లి రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ మల్లికార్జునరావు

రెవెన్యూ సదస్సులు

మిడ్జిల్: గ్రామాల్లో రైతుల భూ సమస్యలను పరిష్కరించడం కోసమే భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని తహసీల్దార్ రాజు అన్నారు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం దగ్గర నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలి

దేవరకద్ర: గ్రామ స్థాయిలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని టీపీసీసీ పరిశీలకులు దొమ్మట సాంబయ్య విజయభాస్కర్‌లు తెలిపారు. దేవరకద్ర ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. అన్ని గ్రామాలలో కాంగ్రెస్ జెండా ఎగరాలని, దీనికి ఇప్పటి నుంచే ప్రజలకు చేరువకావాలన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీల వైఫల్యాలను ప్రచారం చేయాలని ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా అందరు సమిష్టిగా పని చేయాలన్నారు.



మాట్లాడుతున్న పీసీసీ పరిశీలకులు సాంబయ్య

కాంగ్రెస్ గెలుస్తుందని ప్రతిపక్షాల కుట్ర

- సీనియర్ కాంగ్రెస్ నేత, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్

మహబూబ్‌నగర్ క్రీడలు: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందనే అక్కసుతోనే ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయని సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, నియోజకవర్గంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి కాంగ్రెస్ పార్టీని గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌లో వార్డుల విభజన విషయంలో అశాస్త్రీయంగా ఉందని ప్రతిపక్ష నాయకులు ఫిర్యాదులు చేయడం జరిగిందన్నారు. కార్పొరేషన్‌లో 60 సీట్లు కాంగ్రెస్ గెలుస్తుందన్న వాస్తవాన్ని ప్రతిపక్షాలు జీర్ణించుకోలేక పోతున్నాయని ఆరోపించారు. జీఓ ప్రకారం అధికారులు వార్డుల విభజన చేస్తున్నట్లు తెలిపారు. అభ్యంతరాలపై ప్రతిపక్షాలు ఫిర్యాదులు ఇచ్చారని, ఫైనల్ లిస్టు వచ్చే వరకు వేచిచూడాలని హితవుపలికారు. సమావేశంలో ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వినోద్‌కుమార్

కాంగ్రెస్‌కు అనుకూలంగా డివిజన్ల విభజన

- మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మహబూబ్‌నగర్ నగర పాలక డివిజన్లను అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులకు అనుకూలంగా విభజన చేస్తున్నారని మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు ఆరోపించారు. గురువారం బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వార్డుల విభజన శాస్త్రీయంగా జరగడం లేదని, అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి జరుగుతున్న పొరపాట్లను సరి చేయాలని కోరారు. ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని, ఆ వ్యతిరేకతను అధిగమించి గెలిచేందుకు అవకాశం ఉన్నట్లుగా వార్డులను విభజించుకుంటున్నారని ఆరోపించారు. వార్డులను విభజిస్తే భవిష్యత్‌లో అభివృద్ధికి ఆటంకం కలుగుతుందన్నారు. పెద్ద గ్రామ పంచాయతీలు, వార్డుల పేరు కనుమరుగయ్యే విధంగా విభజన చేశారన్నారు. ప్రజలకు వాస్తవాలు వివరించి పోరాటం చేస్తామన్నారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు శివరాజ్ మాట్లాడారు.



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు

నేడు పెద్దవార్వాల్‌కు ఎమ్మెల్యే రాక

గండేడ్: మండలంలోని ఆయా గ్రామాల్లో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పర్యటించనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, పీసీసీ మెంబర్ నరసింహరావులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు పెద్దవార్వాల్ గ్రామంలో జరిగే భూ భారతి కార్యక్రమంలో పాల్గొంటారని వారు తెలిపారు. పెద్ద వార్వాల్‌లో రూ.15లక్షల సీసీ రోడ్లు, రూ.13.5 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాలు ప్రారంభోత్సవం చేయనున్నట్లు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వెన్నాచేడ్, పెద్దవార్వాల్ గ్రామాల్లో హైమస్ట్ లైట్ల నిర్మాణానికి శంకుస్థాపన, లింగాయపల్లి, జక్లపల్లి, జిన్నారం మట్టి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.